



**నగరంలో** కంటికింపయిన రకాలకీ, వరస మించిన ధరలకీ ఖ్యాతి గాంచిన ఒకానొక రెడీమేడ్ బట్టల దుకాణంలో మొదలయింది అసలు కథ.

"బాబ్జీగాడి పుట్టిన రోజు దగ్గిరికి వచ్చేస్తోందండీ" అని పద్మావతి వారం రోజుల పోరు పెట్టగా, ఇవాళ లీవు చేసుకుని, కుటుంబ సమేతంగా షాపింగ్‌కి వచ్చాడు శ్రీనివాస్.

"పుట్టినరోజు బాబ్జీదే అయినా, బుజ్జాయికీ ఒక గౌను కొనాలిసిందే."

"ఇదేమిటి?" అని శ్రీనివాస్ అడిగితే "దాని క్కొనకపోతే వాణ్ణసలు కొత్త డ్రస్ వేసుకోనిస్తుందనుకున్నారా?" అంటూ పిల్లలిద్దర్నీ చెరో చేత్తో పట్టుకుని దుకాణం లోపలికి దారి తీసింది పద్మావతి.

"అవునవును—అదసలే రాకాసి. అంతా అమ్మగారి పోలికే" అని పద్మావతికి వినిపించకుండా మెల్లిగా అంటూ స్కూటర్ పార్క్ చేసి తాళం వేశాడు.

బట్టల షాపు మంచి బిజీ టైమ్ కేమో జనంతో కిటకిటలాడి పోతూంది. శ్రీనివాస్ దుకాణంలో అడుగు పెట్టే సరికి పద్మ ఒక చోట నిలుచుని, తన ముందర వేసిన డ్రస్‌ల డిజైన్లనీ, వాటన్నీ పరీక్షిస్తూ కనిపించింది. పిల్లలిద్దరూ అమ్మ కొంగు పట్టుకుని నిలుచుని మధ్య మధ్య ఆమెకు సలహాలు ఇస్తున్నారు.

తను దగ్గరగా వెళ్ళినా వాళ్ళతో పాటు నిలుచునే స్థలం లేదు. అందుకని కాస్త ఎడంగా, చుట్టూ గాజు తలుపుల అల్మైరాలు, షోకేసుల్లో ఉన్న రకరకాల బట్టలనీ, రంగురంగుల దీపాలతో వాటిని అలంకరించి ప్రదర్శించిన తీరునూ గమనిస్తూ నిలుచున్నాడు శ్రీనివాస్.

ద్వారానికి ఒక పక్కగా ఉన్న నిలువెత్తు షోకేసు నిండుగా ఉన్న నైట్‌గౌన్ల వంక మళ్ళింది అతని దృష్టి. అంతే! అక్కడి నుంచీ చూపులు తిప్పుకోలేక పోయాడు. కాటన్ హాండ్‌లూమ్స్ బట్టతో కుట్టిన మాక్సీల్లాంటి గౌన్లు మొదలు పలుచని ఉల్లి పొర బట్టలతో, చిత్రాతి చిత్రమయిన కుచ్చుల డిజైన్లతో కుట్టిన నైటీల దాకా ఎన్నో రకాలు ఉన్నాయి. అన్నీ అమ్మాయిలకీ, ఆడ వాళ్ళకీ పనికి వచ్చేవే!

'పద్మ వీటిలో ఒకటి ధరిస్తే ఎలా ఉంటుంది?' అన్న ఒక తమాషా ఆలోచన వచ్చింది శ్రీనివాస్‌కి.

నైట్ గౌన్లు వేసుకున్న అమ్మాయిలని సినిమాల్లో ఎన్నిసార్లో చూశాడు. కానీ తన భార్య పద్మ మాత్రం అంత వరకూ ఎప్పుడూ వేసుకోలేదు. పేరుకి సిటీలో ఉన్నారన్న మాటేగానీ, అలవాట్లన్నీ చిన్నతనంలో గడిపిన తమ చిన్న వూరివే గద!

ఆలోచనల్లోనే నైట్‌గౌన్లో భార్య రూపం ఎలా ఉంటుందో అని వూహించుకోబోయాడు, కళ్ళు మూసుకుని. అందంగా, అద్భుతంగా, అపురూపంగా కనిపించింది. అతనా అనుభవం నుంచీ

ఇంకా కొలుక్కోకముందే, పద్మ దగ్గిరి కొచ్చి, మోచేతి మీద గిల్లి "ఏమిటా పరధ్యానం? ఇండి ఇటు. కొన్ని చూశాను. మీరూ చూస్తే సెలెక్ట్ చేయవచ్చు" అని లాక్కుని వెళ్ళింది.

"నేను చూసేదేముందోయ్! నీ సెలక్షన్ సరిగ్గా ఉంటుంది—నాకు తెలీదూ? ఇదిగో—ఈ రెండేనా చక్కగా ఉన్నాయి. పాక్ చేయించేస్తాము. ఇంకా ఏమయినా కావాలా?"

"ఊc. దీనికి చెడ్డీలు నాలుగు, నాకో అరడజను మీకూ కొన్ని రుమాళ్ళు. కొనాలండీ"

"అదిగో—అటు వైపు ఉన్నట్లు ఉన్నాయి. చూడు. ఏదీ—పిల్ల దిద్దర్నీ ఇట్లా పంపించు" అంటూ జనం నుంచీ కాస్త విడంగా పిల్లల్ని తీసుకుని వెళ్ళాడు శ్రీనివాస్.

పద్మావతి షాపింగ్ అయింది. బట్టల పొట్లాన్ని పుచ్చుకుని "పదండి" అన్నది. "ఇదిగో—పద్మా! ఇటు చూడు ఒకసారి" అంటూ షోకేస్‌లో ఉన్న నైట్ గౌన్లని చూపించాడు.

"బావున్నాయి కదూ?"

"హుc—బాగానే ఉన్నాయి."

"నీటిలో ఒకటి నువ్వేసుకుంటే బావుంటా వోయ్." చెవిలో గుసగుసలుగా అన్నాడు శ్రీనివాస్.

"చాల్లెండి, సంబడం" అని చిన్నగా మూతి తిప్పుతూ దుకాణంలోంచి బయటికి కదిలింది.

'బొత్తిగా సరసం తెలీదు. చెప్పినా అర్థం కాదు' అని మనసులోనే తిట్టుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు శ్రీనివాస్.

దుకాణంలో ఉండగా చిన్న మొలకగా పుట్టిన నైట్‌గౌన్ పిచ్చి శ్రీనివాస్‌కి మనసులో ఇల్లు చేసుకునేటప్పటికి పెరిగి పెద్దదై మహా వృక్షమై కూర్చుంది.

'ఎలాగయినా పద్మని కాకాపట్టి ఒప్పించి, ఒక నైట్ గౌన్ కొనిపించాలి' అని మనసులోనే నిర్ణయం చేసుకున్నాడు.

నిర్ణయం అయితే చేసుకున్నాడు కానీ పద్మని కాకా పట్టడం అన్నది అంత తేలిక కాదు అని తెలుసు.

అందుకే ఇల్లు చేరగానే రంగంలోకి దిగాడు.

తను బట్టలు మార్చుకుని, పిల్లలిద్దరికీ మార్చేసి, "ఏమయినా సహాయం కావాలంటే చెప్పవోయ్" అని పద్మ వెంట పడ్డాడు శ్రీనివాస్.

ఆశ్చర్యంగా చూసింది ఇంటికి వచ్చింది మొదలు ఆఫీసులో కొండలు పిండికొట్టి వచ్చిన వాడిలా మంచానికో, సోఫాకో అడ్డంపడి, ఏ పేపరో పుచ్చుకుని చదువుకోవటమే తప్ప, బజారు వెళ్ళి కూరలు తేవాలన్నా కదలటం ఇష్టం ఉండదు శ్రీనివాస్‌కి. అలాంటి వాడిట్లా, ఆఫీసు నుండి వచ్చిన కాస్సేపటికే షాపింగ్ వెళ్ళి వచ్చి కూడా ఇంకా అలసట ఏమీ కలగని వాడిలా పని చేస్తాననటం అపురూపంగా కనిపించింది.


పెదాలు కదిలించకుండా నవ్వుతూ 'ఏమిటి విశేషం?' అన్నట్లు కళ్ళెగరేసింది, అప్పుడే చపాతీల కోసం తడిపిన గోధుమ పిండిని మెత్తగా కలుపుతూ పద్మ.

చీర కొంగును నడుం చుట్టూ తిప్పి దోపుకుని ఆమె నిలుచుని ఉన్న తీరునీ, చిన్నగా కదులుతున్న గాజుల చేతుల్నీ, చిరునవ్వు నవ్వితే ముద్దుగా కనిపిస్తున్న ముఖాన్నీ, కొద్దిగా చెదిరి ముఖం మీద అందంగా జారుతున్న జుట్టునీ అప్పుడే మొదటిసారి చూస్తున్న వాడిలాగా కళ్ళు ఆర్పకుండా చూస్తూ నిలుచున్నాడు శ్రీనివాస్.

అతనికి మూడ్ బాగున్నప్పుడల్లా ఇలాగే అందంగా, అప్సరసలా కనిపిస్తుంటుంది భార్య. ఇంత అందం తన సొంతం అయినందుకు మురిసి పోతుంటాడు శ్రీనివాస్.

"చపాతీలా? నువ్వు ఒత్తుతున్నావా? నేను కాలుస్తాను" అంటూ లోపలికి వచ్చి, ఒక్కసారి పిల్లలున్న ముందర గదిలోకి చూపు సారించి, గబుక్కున పద్మ నడుం చుట్టూ చేతులు వేసి దగ్గరికి లాక్కున్నాడు శ్రీనివాస్.

అంతదాకా అతగాడి చూపుల్ని గమనిస్తున్న




పద్మ ఇలాంటి అల్లరేదో చేస్తాడని ముందే వూహించిన దానిలాగ, "ఇలాగేనా చపాతీలు చేసేది?" అనడిగింది అల్లరిగా అతని ముఖంలోకి చూస్తూ.

ఇంతలో పుత్రికా రత్నం కొంపలేవో మునిగి పోతున్నా యన్నట్లుగా పరిగెత్తి వచ్చి, "ఏమిటే అల్లరి ఎక్కువయిందే నాన్నది" అని కేక వేసింది అమ్మ తన ఆస్తి అయినట్లు, నాన్న అవిడని తాకటానికి వీల్లేదని దాని అభిప్రాయం.

భార్యను వదలి కూతుర్నెత్తి భుజాల మీదికి ఎక్కించుకుని, "ఏమ్మా, హోమ్‌వర్క్ అయిందా, చిట్టితల్లీ?" అని అడిగాడు ముద్దుగా.

"ఏమిసిడీ లేగా—రాసేశాలే. అన్నయ్యే ఏదో లెక్క రాలేదట. నిన్ను రమ్మని పిలుస్తున్నాడు" అంటూ నాన్నను అమ్మ దగ్గర్నుంచీ అవతలికి లాక్కుని వెళ్ళింది.

హోమ్ వర్కులు, భోజనాలు అయి పిల్లలు నిద్ర పోయారు. తాంబూలం వేసుకుని కూర్చుని, చిన్నగా ఆకుల ఈనెలు తీస్తూ, "ఇప్పుడు చెప్పండి, అసలు సంగతేమిటో?" అనడిగింది ఇల్లాలి.

"ఆహా—ఏం లేదు, పద్మా.

"అక్కడ దుకాణంలో చూశాం—గుర్తుందా? ఆ నైట్ గౌన్లు బావున్నాయి కదూ? అందులో ఒకటి నువ్వు వేసుకుంటే చూడాలనుందోయ్!" అసలు సంగతి బయట పెట్టాడు.

అతను దుకాణం దగ్గరే ఆ మాట ఒకసారి అన్నట్లు గుర్తొచ్చింది పద్మకి. అప్పుడు తమాషాగా అన్నాడనుకున్నది. ఇంత సేపటికి ఇప్పుడు అతను మళ్ళీ ఆ మాట అంటూ ఉంటే చిత్రంగా తోచింది.

"ఇదేమిటి—పెళ్ళయిన పదేళ్ళకి, ఇంత వయసు వచ్చినాక, ఈ పిచ్చి పట్టుకుంది మీకు? నాకు వద్దు, పూర్కోండి."

"ఎందుకు? ఎందుకు వూరుకోవాలోయ్, ఏం? ముసలయ్యావనుకుంటే ముసలిదానివయి పోయావా?"

"లేకపోతే నైట్ గౌన్లు, టీలు, మాక్సీలు వేసుకునేంత చిన్న పిల్లనా ఏం నేను?"

"నా కళ్ళకి నువ్వెప్పుడూ పడుచు పిల్లలాగే కనిపిస్తావు. అయినా నేను చెబితే నువ్వు నమ్మవుగనీ, పదేళ్ళ క్రితం మన పెళ్ళయిన కొత్తలో ఎలా ఉండేదానివో ఇప్పుడు అంతకన్నా మరింత అందంగా, నిండుగా ఉన్నావు—తెలుసా? రోజు రోజుకీ నువ్వంటే నాకున్న ఆకర్షణ పెరుగుతూనే ఉంది కానీ, తగ్గి పోవటం లేదు మరి" అంటూ భార్య భుజాల చుట్టూ చేతులు వేసి కళ్ళలో కళ్ళుంచి చూశాడు.

"చాల్లెండి—అన్నీ దొంగ మాటలు." ముసిముసి నవ్వులతో భర్తని ఉడికించింది పద్మ. దాంపత్యానికి పదేళ్ళుగా ఉన్న వాళ్ళనీ, వయో వృద్ధులనీ తేడా లేదు. ఎందుకంటే, అది మనసు అన్నది ఉన్న మనసుకి సంబంధించిన బాధ కాబట్టి.

అతి సామాన్యమయిన అందం ఉన్న అద

దయినా, తన భర్త తనను అపురూప సౌందర్య రాశిగా భావించాలనే ఆశిస్తుంది. అతగాడు తన అందాన్ని గురించి పొగిడినప్పుడు, పైకి చిరు కోపాన్ని ప్రదర్శించినా, వాస్తవానికి లోలోపల పొంగి పోతుంటూ, తద్వారా అతగాడి మీద మరింత అభిమానాన్ని పెంచుకోవటమూ సహజమే.

"అబద్ధాలు చెప్పే కర్మ నాకేం పట్టిందోయ్! నువ్వు నే కట్టుకున్న భార్యవేగనీ, ప్రేయసివో, ప్రియురాలివో కాదుగా, కల్పించి చెప్పి, కష్టపడి బులిపించేందుకు" అని బుంగ మూతి పెట్టాడు శ్రీనివాస్.

• • • •

ఒకటి, రెండు, మూడు రోజులు గడిచాయి. ప్రతి రోజూ తన కోరిక తీర్చమని భార్యని కోరు కుంటున్నాడు శ్రీనివాస్. ఉహూఁ, అతని ప్రయత్నా లేవీ ఫలించటం లేదు. ఇది అతనిలో కోరికనీ, పట్టుదలనీ మరింత ఎక్కువ చేసేందుకే తోడ్ప డింది.

"ఇన్నాళ్ళు లేనిది ఇప్పుడు హఠాత్తుగా నైట్ గౌన్ వేసుకుని ఎట్లా తిరగనండి? ఇరుగు పొరుగు చూసి నవ్వుకోరూ? ఇంత వయసొచ్చి, ఈ కుర్రతనం ఏమిటని?!" అని అతనికి నచ్చ జెప్ప బోయింది పద్మ.

"నైట్ గౌన్ అంటే ఎప్పుడు వేసుకుంటారో తెలుసా, పిచ్చి మొహమా? అది వేసుకుని నువ్వు వీధిలోకి వెళ్ళే అవసరం ఏముంది? రాత్రి మనింట్లో మనం తలుపులన్నీ బిగించుకున్నాక వేసుకో. నా కళ్ళతో నేను చూసుకుందుకే గదా నీకు నైట్ గౌన్ కొంటా నంటున్నది."

ఇట్లా కాదని, మరో రకంగా నిరుత్సాహ పరచ బోయింది పద్మ.

"అదికాదండీ—అంత రహస్యంగా, ఎవ్వరికీ తెలీకుండా పిల్లలను నిద్రపుచ్చి, ఆ కాస్సేపు వేసుకునే నైట్ గౌన్ ఎంత ఖరీదు అయిందీ తెలుసా మీకు? ఒక వందయినా ఉంటుందేమో! అనవసరమయిన దండుగ ఖర్చు కదూ?"

"పర్లేదోయ్, నువ్వు ఏ అమావాస్యకో, పౌర్ణ మికో, పెళ్ళికో, పండక్కో మాత్రం కట్టుకుని భద్రంగా బీరువాలో దాచుకునే వందలు పోసి కొనే పట్టు చీరల కన్నా నయమేకదూ? అయినా డబ్బెట్టి కొనిపెడుతున్నది నేను. నీకెందు కా చింత? కావాలో వద్దో నిర్ణయించుకో—చాలు."

"పద్మ మొర్రో అని మొత్తుకుంటున్నా వినకుండా బలవంతం చేస్తూ, పైగా నిర్ణయించు కో అని అల్టిమేటమ్ ఒకటా?" అని అంది పద్మావతి.

ఉసూరుమని నిట్టూర్చి వూరుకున్నాడు శ్రీనివాస్.

మూడు రోజులు కొనసాగిం దీ చర్చ. రోజు రోజుకీ తన కోరిక తీరేలాగ లేదన్న నిరాశ ఎక్కువ అవుతూంది శ్రీనివాస్‌కి.

నాలుగో రోజు ఉదయం నిద్రలేవగానే, పక్కనే నిద్రలో ఉన్న భర్తను తట్టి లేపింది పద్మావతి.

"శ్రీవా" అని చెవిలో మెల్లిగా అంటున్న పద్మావతి పిలుపు ఎక్కడో కలలో లాగా ఉంది శ్రీనివాస్‌కి. పద్మ భర్తని అట్లా ప్రేమగా పేరు పెట్టి పిలవటం చాలా అరుదు. ఎప్పుడో మురిపించుకునే రోజుల్లో అలవాటుగా ఉన్న పిలుపు అది.

కళ్ళు మూసుకునే పద్మను గుండె మీదికి లాక్కోబోయాడు శ్రీనివాస్.

"ఏమండీ, ఇవాళ నైట్ గౌన్ కొనుక్కుందాం. నాకూ ఇష్టమే" అంది చిన్నగా పద్మ. శ్రీనివాస్ నిద్ర ఎగిరి పోయింది.

"ఆఁ—ఏమిటన్నావ్?" అని ఉలిక్కిపడి లేచి కూచున్నాడు.

"నేను విన్నది నిజమేనా?"


"అంత ఆశ్చర్యం ఎందుకూ? మీరు అంతగా మోజు పడుతున్నారు కదా అని సరే అనుకున్నాను అంతే" అని లేచి పోయింది.

పద్మావతి అట్లా అన్నది అసలు విషయం

స్వీట్లు, సమోసా, కట్‌లెట్ తిని, కాఫీ తాగి పదిహేను రూపాయల బిల్ చెల్లించి బయట పడ్డా రిద్దరూ. ఆ వేళ పిల్లలకి బట్టలు కొన్న దుకాణం దగ్గరికి వెళ్ళి స్కూటర్ ఆపిన తర్వాత అన్నది పద్మ: "ఇక్కడికి ఎప్పుడూ వస్తుంటాను. సేల్స్ మెన్‌కి అలవాటు అయిందిలెండి. నన్ను, నా పక్కనుని మిమ్మల్ని చూసి, నైట్ గౌన్ కొనబోతే నవ్వుకుంటారేమో!"

"పిచ్చిదానా! నువ్వేది కొంటే వాళ్ళకేమిటి? నీలాంటి వాళ్ళు ఎన్ని వందల మంది వచ్చి పోతుంటారో ఆ దుకాణానికి. అయినా నీ కా ఫీలింగ్ ఉంటూ కలిగిన తర్వాత ఇక్కడికే ఎందుకు? ఇంకో చోట చూద్దాం పద" అని మళ్ళీ స్కూటర్ స్టార్ట్ చేశాడు శ్రీనివాస్.

ఒక దుకాణంలో శ్రీనివాస్‌కి డిజైన్లు నచ్చ లేదు. మరొక దాన్లో పద్మకి ఖరీదులు నచ్చలేదు. ఇంకోదానిలో సైజు కుదరలేదు. చివరకు నాలుగో




చెప్పటం ఇష్టంలేక. రాత్రి నిద్రలో నైట్‌గౌన్ వేసుకున్న మరో అమ్మాయి వెంట శ్రీనివాస్ పరిగెత్తు తున్నట్లుగా కల వచ్చింది ఆమెకు. ఆ దెబ్బతో రాత్రికి రాత్రి మనసు మార్చు కున్నది. మనసు మార్చుకున్న తర్వాత ఆగలేక, వెంటనే భర్తను లేపి చెప్పేసింది.

సాయంత్రం నైట్ గౌన్ కొనేందుకు షాపుకు వెళ్ళాలంటే పిల్లలు ఇద్దరూ లేకుండా తప్పించు కుని వెళ్ళాలి. ఎలా? అన్న సమస్య వచ్చింది శ్రీనివాస్‌కి.

ఆ సమస్యనీ పద్మావతే తీర్చింది.

ఆ వేళ సాయంత్రం టి. వి.లో మంచి పిల్లల ప్రోగ్రామ్ ఏదో ఉన్నది. పక్క ఇంట్లో టి. వి. ఉంది. సాయంత్రం పిల్లల్ని పక్క ఇంట్లో అప్పగించే ఏర్పాటు చేసుకుంది పద్మ.

ఇన్నాళ్ళకి పిల్లల్ని తప్పించుకుని హాయిగా జంటగా బయటికి వచ్చాం కదా అని, మంచి హోటలుకి తీసుకెళ్ళాడు శ్రీనివాస్.

చోట కొనుక్కుని, నూట తొమ్మిది రూపాయల తొంభయి తొమ్మిది పైసలు బిల్లు చెల్లించి బయట పడ్డారు.

అప్పుడే ఇల్లు చేరి, పిల్లల్ని పిలుచుకొచ్చి, భోజనాలు పెట్టి, తాను భోజనాలు ముగించి, వంట గది సర్దుకునే సరికి నీరసం వచ్చేసింది పద్మకి. నైట్‌గౌన్ మోజుని మరు రోజుకి వాయిదా వేసుకుని నిద్రపోయాడు శ్రీనివాస్.

ఆ మరు రోజున అనివార్యంగా మరో మూడు రోజులు వాయిదా వేసింది పద్మావతి.

నాలుగో రోజు రాత్రి భోజనాలు అయిన తర్వాత ప్రత్యేకంగా స్నానం చేసి, మెండుగా సెంటు రాసి ఉంచుకున్న నైట్‌గౌన్ వేసుకుని, కొత్త పెళ్ళి కూతురిలా సిగ్గుపడుతూ భర్త దగ్గరికి చేరింది పద్మావతి. సిగరెట్ కాలుస్తూ సోఫాలో కూర్చుని ఉన్న అతని పక్కన కూచో బోయింది.

"ఉహూఁ— పద్మ, కాస్సేపు అట్లా నిలుచో

సిగ్గు పడకుండ. బాగా చూడనీ నన్ను. అంతగా మోజు పడింది దేని కనుకున్నావు?" అంటూ అంత దూరాన నిలుచోబెట్టి నఖశిఖ పర్యంతం పరీక్షించ బోయాడు.

బయట కాలింగ్ బెల్ మోగింది. అంచే బెదురుగా చూస్తూ, "ఇప్పు డెట్లాగండీ" అన్నది పద్మావతి.

"ఇట్లా గేమిటి? నువ్వు లోపలికి వెళ్ళు—వచ్చిం దెవరో నేను చూస్తాను" అని లేచి వెళ్ళి తలుపు తీశాడు.

ఎదురింటి వాళ్ళ అమ్మాయి పదేళ్ళ రాధిక నిలుచుని ఉంది. "ఏమమ్మా, ఏం కావాలి?"

"అంటీ లేరా, అంకుల్?"

"ఎందుకూ?"

"నిద్ర పోతున్నారేమో, కాస్త లేపుతారా? మా అమ్మ పిలుస్తున్నది."

"ఏమయిందమ్మా? గాభరా పడుతున్నావేం?"

"మా తమ్ముడు ఏమిటో పిచ్చిగా చేస్తున్నా డండీ, మా నాన్న వూళ్ళో లేరు. అందుకనీ..."

"ఉహూం—ఇదుగో, పద్మా" అని పిలుస్తుండగా, వస్తున్నానంటూ హడావిడిగా చీర కట్టుకుని రాధిక వెంట బయలు దేరింది. పిల్లాడికి జ్వరం, టెంపరేచర్ ఎక్కువై ఫిట్స్ వస్తున్నాయి. ఆవిడకి ధైర్యం చెప్పి, డాక్టర్ని ఇంటికి పిలిపించటంలో సహాయపడి, కాస్సేపు తోడుగా ఉండి పద్మావతి ఇల్లు చేరేసరికి అర్ధరాత్రి అయింది. తను విప్పి కుప్పగా పడేసి వెళ్ళిన నైట్ గౌన్ని శ్రీనివాస్ పదిలంగా మడిచి, బీరువాలో ఉంచి ఉండటం గమనించి నవ్వుకుంటూ నిద్రపోయింది పద్మావతి.

• • •

సాయంత్రం శ్రీనివాస్ ఇల్లు చేరుకునే సరికి ఇంట్లో మనుషులు హెచ్చుగా ఉన్న శబ్దాలు వినిపించాయి. అతిథులు కాబోలు అనుకుంటూ లోపలికి అడుగు పెట్టాడు.

ముందర గదిలోనే తోడల్లుడు, పద్మ బావ గారు అయిన రాజారాంగారు దర్శన మిచ్చారు.


"హలో! ఏమిటోయ్, శ్రీనివాస్" అని ఆయన అనటమూ, "హలో! ఇదేనా రావటం?" అని ఇతను పలకరించటమూ ఒకేసారి జరిగాయి.

"అవునోయ్. ఆఫీస్ పని ఒకటి వచ్చింది. బయలు దేరబోతే మీ వదినే వెంట వస్తానంది. చాలా రోజులయింది—చెల్లాయిని చూడాలని... ఇహనేం, నలుగురం కలిసి వచ్చేశాము."

"మంచి పని చేశారు" అని పైకి అన్నా, శ్రీనివాస్ గుండెలో రాయి పడింది. 'ఇక అయి నట్లే—ఈ పద్మ ఆ నైట్ గౌన్ వేసుకునే దెప్పుడో, నేను చూసేదెప్పుడో' అనుకున్నాడు నిస్పృహగా.

పద్మావతి అక్క, రాజ్యం, వెంబడే కాఫీ కప్పులతో ఆవిడ కూతురు అమ్మణ్ణీ ఇవతలికి వచ్చారు. 'రాణీగారిని ఏకాంతంగా దొరకటం కూడా కష్టమే కాబోలు' అనుకున్నాడు శ్రీనివాస్ కాఫీ తాగుతూ.

మెల్లిగా వంట గదిలోకి జారుకుని "ఏమిటోయ్, బిజీనా?" అన్నాడు పద్మతో.




అక్కయ్య, ఆవిడగారి కుటుంబం వచ్చారని సంతోషంగా ఉంది పద్మకి. మధ్యాహ్నం నుంచీ అక్కతో ఎన్ని కబుర్లు చెప్పినా తరగటం లేదు.

"మరి నైట్ గౌన్ సంగతేమిటి?" అనడిగాడు గుసగుసగా.

"చాల్లెండి—ఎప్పుడూ ఈ గోలేనా? ఇంటికి చుట్టాలు వచ్చారు కదా? కాస్త సరుకు లేమయినా కావాలా, కూరగాయలు తేవాలా అని అడగరేమిటి?"

"అవును కదూ. సారీ, డియర్. ఏదీ—ఇదుగో, ఈ సిగరెట్టు కాల్చుకో నివ్వు. నీ కేమేం కావాలో ఒక లిస్ట్ రాసి ఇచ్చేస్తే నిమిషాల్లో తెచ్చి పడేస్తాను—సరేనా?"

"లిస్ట్ అమ్మణ్ణి రాస్తుంది. దాన్నిట్లా పిలవండి. డబ్బు ఎంత ఉందో చూసుకోండి ముందు" అని హడావిడి పడిపోయింది పద్మ.

ఆ హడావిడి అలా వారం రోజులకి గానీ తగ్గలేదు. చుట్టాలు కదిలిన రోజునే శ్రీనివాస్ కూడా ఆఫీస్ పని మీద క్యాంపు వెళ్ళాడు. ఇన్ని గొడవల్లో నైట్ గౌన్ మోజు మరుపుకు వచ్చి మరుగున పడక తప్పలేదు ఇద్దరికీ.

ఆ వేళ రాత్రి పిల్లలిద్దరూ నిద్దర్లు పోయాక పద్మావతి ఒంటరిగా పొద్దు పోక, నిద్దరాక పత్రికలు ముందేసుకుని కూర్చుంది.

'ఈ రోజు రావలసింది ఈయన ఎందుకు రాలేదో! బోరుగా ఉంది' అనుకుంది. హఠాత్తుగా ఏదో గుర్తు వచ్చింది. గబగబా వెళ్ళి బీరువా తెరిచింది. చీరెల అడుగున దాచి ఉంచిన నైట్ గౌన్ బయటికి తీసింది.

'ఎంత మోజుగా కొన్నారో, పాపం! ఆయన మోజు తీరనేలేదు.' అనుకుంటూ దాన్ని తీసి వేసుకుని అద్దం ముందర నిలుచుంది. పిల్లలిద్దరూ మంచి నిద్రలో ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాత ట్యూబ్ లైటు వేసుకుని, అద్దంలో చూసుకుంది. మెత్తగా పాము కుబుసంలాంటి, కొద్దిగా పలుచని బట్టతో కుట్టారా గౌను. మెడ చుట్టూతా, నడుం దగ్గరా, కింద, చేతుల కొసలకీ ఫ్రిల్స్ ఉన్నాయి. తల అంటుకుని ముడేసుకున్న జుట్టుని విప్పి భుజాల మీదుగా ముందుకి వేసుకుంది. అంత వరకూ గౌను అంద చందాలు పరీక్షిస్తున్న దల్లా ఉలిక్కి పడి అద్దంలోకి పరీక్షగా చూసుకుంది. అద్దంలో కనిపిస్తున్న ప్రతిబింబం తనదేనా అనిపించింది. శ్రీనివాస్ దీని కోసం అంతగా ఎందుకు మోజు పడ్డాడో కొద్ది కొద్దిగా అర్థం అవుతూ ఉంది.

సరిగ్గా అప్పుడే కాలింగ్ బెల్ మోగింది.

ఏం చేయాలో తోచలేదు పద్మకి. రాత్రి పదకొండు గంటల సమయం. వచ్చిం దెవరో తెలియదు. ఈ అవతారంతో ఎలా వెళ్ళి తలుపు తీయటం? అసలు తీయాలా, వద్దా? అని సందేహం పట్టుకుంది.

ఇంకోసారి తలుపులు తట్టిన శబ్దం, వెనువెంటనే కిటికీ మూసిన తలుపుల దగ్గరనించి "నేనేలే, పద్మా—తలుపు తియ్యి" అన్న శ్రీనివాస్ స్వరమూ వినిపించాయి.

'హమ్మయ్య' అని తేలిగ్గా వూపిరి పీల్చుకుని, చిన్నగా తలుపు తీసి లోపలికి పరిగెత్త బోయింది. అప్పటికే అది గమనించిన శ్రీనివాస్ ఒక చేత్తో పద్మ చెయ్యి గట్టిగా పట్టుకుని, లోపలికొచ్చి తలుపు వేశాడు, సూట్కేస్ కింద ఉంచి.

"అద్భుతంగా ఉన్నావు, డార్లింగ్. అసలు మనింటికి ఎవరో కొత్త అమ్మాయి వచ్చిందను కున్నా" అంటూ ఆమె భుజాలు పట్టుకుని, ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూశాడు శ్రీనివాస్.

"పాపం, మీ ఈ చిన్న కోరిక తీరేందుకు ఎన్నాళ్ళు పట్టిందండీ?" అని జాలిగా అంటూ భర్తని మరింతగా హత్తుకుని పోయింది పద్మావతి. ★